



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 24 మే 2026 పేజీలు : 04


# పరిశుభ్రత ఆరోగ్యానికి...ఆర్థికాభివృద్ధికి, సామాజిక బాధ్యత: మంత్రి




ర్యాలీగా వెళుతున్న మంత్రి జనసేన నాయకులు చిలకం సిబ్బంది



చెత్తను ఊడుస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**ధర్మవరం రూరల్, మే 23 ప్రభాతవార్త**

పరిశుభ్రత అనేది కేవలం శుభ్రతకే సంబంధించిన అంశం కాదని, అది ఆరోగ్యానికి, ఆర్థికాభివృద్ధికి, సామాజిక బాధ్యతకు కూడా సంబంధించిన అంశమని రాష్ట్ర కుటుంబ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారుశని వారం ధర్మవరం పట్టణంలోని పోతుకుంట శివాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ తో పాటు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి స్వయంగా పార పట్టుకుని రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, కార్యక్రమం నిర్వహించిన ప్రాంతాన్ని స్వయంగా శుభ్రపరిచారు. అనంతరం స్థానిక ప్రజలతో మరియు మున్సిపల్ కార్మికులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఒక స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, తద్వారా స్వర్ణ ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మరింత విస్తృతస్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యంతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో మే 22 నుండి జూన్ 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి వారంలో రెడ్ స్పాట్స్, ఎల్లో స్పాట్స్ గుర్తించి శుభ్రపరచడం, రెండో వారంలో డ్రైన్లు, కాలువలు, నాళాలను శుభ్రపరచడం, మూడో వారంలో నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు, నాలుగో వారంలో వాణిజ్య ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. క్లీన్‌లీనెస్ ఈజ్ నెక్స్ట్ టు గాడ్‌లీనెస్ అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ, పరిశుభ్రతకు మన జీవితంలో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ 2014 అక్టోబర్ 2న ప్రారంభించిన స్వచ్ఛ భారత్ మిషన్ దేశంలో గొప్ప మార్పుకు నాంది పలికిందన్నారు. వేల కోట్ల రూపాయల నిధులతో దేశవ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంగా మార్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా సుమారు 12 కోట్ల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ద్వారా మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే ప్రయత్నం జరిగిందన్నారు. పరిశుభ్రత లేమి కారణంగా దేశ జీడీపీలో దాదాపు 6 శాతం నష్టం వాటిల్లుతోందని వరల్డ్ బ్యాంక్ నివేదికలు సూచిస్తున్నాయని, అందువల్ల పరిశుభ్రత ఒక ఆర్థిక సంస్కరణగా కూడా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ గ్రామాలు, పట్టణాల నిర్మాణం ద్వారా ప్రతి ఏడాది లక్షలాది మంది ప్రాణాలు కాపాడబడుతున్నాయని, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతోందని వివరించారు. ధర్మవరం పట్టణాన్ని స్వచ్ఛమైన, ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికులు ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని, ప్రజలు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయడం వంటి చర్యల వల్ల డ్రైనేజీలు మూసుకుపోయి వర్షాల సమయంలో రోడ్లపై మురుగు నీరు చేరే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాల ఆరోగ్యకరమైన జీవనానికి ఇవి ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం శుభపరిణామమని అన్నారు. ధర్మవరం మున్సిపాలిటీలో మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయమన్నారు. పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే అధికారులతో పాటు మున్సిపల్ సిబ్బంది, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ధర్మవరాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ నాయకత్వంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఇన్చార్జి ఆర్డీవో బి సువర్ణ, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మున్సిపల్ ఈ.ఈ సాయికృష్ణ, డి.ఈ వీరేష్, ప్రకాష్, టిపిఆర్ఓ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు దేశం గురించి ఆలోచించాలి..

- 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం..
- కుటుంబానికి పరిమితం కాకుండా దేశాన్ని కూడా సేవ చేయాలి..
- పవిత్ర భారతదేశంలో భారతీయుడిగా పుట్టడమే మన అదృష్టం..
- ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన..
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్..



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్,



సమావేశానికి హాజరైన అధికారులు,

**గుంతకల్ రైల్వే మే 23 ప్రభాత వార్త**

గుంతకల్ రైల్వే డివిజనల్ గుంతకల్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన రోజ్‌గార్ మేళా కు భారత ప్రభుత్వ హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోజ్‌గార్ మేళాకు కేంద్రంలో ప్రభుత్వ పరీక్షల ద్వారా అర్హత సాధించిన వారికి పలు రకాల ఎంపికైన 130 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేడు 19 వ రోజ్ ఘర్ మేళ ను భారత ప్రభుత్వం నిర్వహిస్తుంది అన్నారు... భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టిన నాటినుండి ఇప్పటి వరకు19 సార్లు నిర్వహించిన రోజ్ గార్ మేళ కార్యక్రమంలో 12 లక్షలకు పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన చేశామన్నారు.. నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న 19 వ రోజ్ ఘర్ మేళ కార్యక్రమంలో దాదాపుగా 51000వేల మంది ఉద్యోగాలు పొందారు. గుంతకల్ డివిజన్లో దాదాపుగా డివిజన్ పరిధిలో 130 మంది ఉద్యోగులకు నియామక పత్రాలను అందజేశారు. ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ వీడియో సమావేశం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్ కేంద్రమైన గుంతకల్ లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగ పత్రాలు అందుకున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతూ వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు మొదట దేశం గురించి ఆలోచించాలి తర్వాత మన కుటుంబం గురించి ఆలోచించాలంటూ బండి సంజయ్ తెలిపారు. తల్లిదండ్రులు తిండికి లేకున్నా తిప్పలు పడి కూలీనాలీ చేసి అప్పులు చేసి పిల్లలను చదివించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దారు. పేదోడికి కాళ్లకు చెప్పులు లేకుండా మాసిన బట్టలతో ఉన్నా తమ కూతురు, కొడుకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం సాధించారని గొప్పగా చెప్పుకుంటున్నారు. గత ప్రభుత్వాలు లీకేజీలు, అవినీతి అక్రమాలు పైరవీలు, దళారీ వ్యవస్థ లేకుండా ఉద్యోగాలు పొందలేరన్నారు. నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత అలాంటి వ్యవస్థలకు చెక్కుపెట్టి కష్టపడి చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం పొందారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి 12 లక్షల కోట్ల నిధులను మంజూరు చేసిన ఘనత మోడీది అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్లో రెండు సంవత్సరంలో 300 లక్షల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమం చేపట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి కోసం 58 కోట్ల సహాయం చేసిన మన ప్రధాని మోడీ దన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మనము ముందుకు వెళ్తున్నాం. ఈ దేశంలో పేదరికం పోవాలన్నదే మోడీ ఆలోచన. అనేక సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలనదే మోడీ లక్ష్యం. దేశంలోని మూడు కోట్ల మందికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు ఇచ్చారు. 80 కోట్ల మందికి గరీబ్ కళ్యాణ్ పథకం ద్వారా లబ్ది పొందారు. 8 కోట్ల మందికి ఉచితంగా గ్యాస్ పంపిణీ చేశారన్నారు . ఈ దేశంలో రైల్వే లైన్లు, రోడ్లు, నేషనల్ హైవేస్ అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు నరేంద్ర మోడీ చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల్లో కల్పించే విషయంలో వెనుకంజు వేసిన కేంద్ర ప్రభుత్వ ముందడుగు వేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు . ప్రతి ఉద్యోగస్తుడు రాబోయే భవిష్యత్తులో గర్వంగా, నిజాయితీగా, అవినీతికి దూరంగా జీవించాలన్నారు. పవిత్ర భారతదేశంలో భారతీయుడిగా పుట్టడమే మన అదృష్టమన్నారు. ఉద్యోగ సాధించడం కాదు పదిమందికి ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దురుడమే మీ కర్తవ్యం అంటూ వారు తెలిపారు. రోజ్గార్ యోజన ద్వారా ఉద్యోగం పొందిన ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని తమ తల్లిదండ్రులు మంచిగా చూసుకోవాలని సమాజానికి మంచి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏ డి ఆర్ ఎం శివ ప్రసాద్, డిపిఓ ప్రసాద్. డివిజన్ అధికారులు టి ఆర్ డి సుదర్శన్ రెడ్డి, సీనియర్ డిసిఎం మనోజ్, డియన్ కోఆర్డినేషన్ శ్రీనివాసులు, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ శ్రీనిబాద్, డి ఎం ఈ మణి కుమార్ ,డిఎంఎం సిద్దిక్, డివిజన్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




నూతనంగా ఎంపికైన ఉద్యోగులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి

# కస్టమ్స్ అధికారులను తయారు చేయడంలో నాసన్ కీలక పాత్ర

- దేశ భద్రత, సులభతర వాణిజ్యంలో పరోక్ష పన్నుల్లో కస్టమ్స్ అధికారుల పాత్ర కీలకం.
- వైభవంగా 76వ బ్యాచ్ ఐఆర్ఎస్ స్నాతకోత్సవ కార్యక్రమం.
- గోరంట్ల మండలం పాలసముద్రం నాసిన్ లో.....కేంద్రమంత్రి పంకజ్ చౌదరి



సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి



ట్రైనింగ్ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం.

**గోరంట్ల మే 23 ప్రభాత వార్త**

దేశ భద్రత, సులభతర వాణిజ్యంలో పరోక్ష పన్నులు, కస్టమ్స్ అధికారుల పాత్ర కీలకమని కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. మండలం లోని పాలసముద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సెస్ నార్కోటిక్స్ ఆధ్వర్యంలో జరిగిన 76వ బ్యాచ్ స్నాతకోత్సవ వేడుకలో భారత ప్రభుత్వ కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 79 మంది ఐఆర్ఎస్ (కస్టమ్స్ ఇండైరెక్ట్ టాక్సెస్) అధికారులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశ భద్రతను కాపాడటంలో మరియు సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించడంలో పరోక్ష పన్నులు, కస్టమ్స్ అధికారుల పాత్ర కీలకమైనదని, వారి సేవలు భారతదేశ ప్రగతి మార్గానికి దోహదపడతాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. సిబిఐసి వేగంగా ఆధునిక సాంకేతిక సంస్థగా రూపాంతరం చెందుతోందని.. ఫేస్‌లెస్ అసెస్‌మెంట్, ఆటోమేషన్, డిజిటల్ కంప్లయన్స్ మరియు డేటా అనలిటిక్స్ వంటి సంస్కరణలు పాలనలో పారదర్శకతను, సమర్థతను పెంచుతున్నాయని తెలిపారు. సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలు, అక్రమ రవాణా నెట్‌వర్క్‌లు మరియు స్మగ్లింగ్ వంటి క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా, వృత్తిపరమైన నైపుణ్యంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవకు సత్యనిష్ఠే పునాది అని, అధికారుల విశ్వసనీయత వారి నిజాయితీ, నిష్పక్షపాత విధానాలపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. అధికారులు తీసుకునే ప్రతి నిర్ణయం వ్యాపారులు, పౌరులపై ప్రభావం చూపుతుందని, కాబట్టి పరిపాలన కేవలం సమర్థవంతంగానే కాక సున్నితత్వంతో, మానవతా దృక్పథంతో సాగాలన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ అప్పగించిన ప్రతి బాధ్యతలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అధికారులకు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమములో నాసిన్ అధికారులు, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్, తహసీల్దార్ మధు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏఎస్ఓ పోస్టుకు పోటీ...!

- ఇటీవల ఏఎస్ఓ పోస్టుకు రాజీనామా చేసిన టీచర్ - పోస్ట్ ఖాళీగా ఉండడంతో పోటీపడుతున్న ఉపాధ్యాయులు - ఈసారైనా నిబంధనల ప్రకారంగా భర్తీ అయ్యేనా?

**అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త**

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏఎస్ఓ పోస్టుకీలకం. ఈపోస్టును అర్హులైన ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేస్తారు. అలాంటి పోస్టులో కొనసాగుతున్న ఒక టీచర్ ఇటీవల రాజీనామా చేశారు. దీంతో ఆ పోస్టు కోసము ఉపాధ్యాయులు పోటీ పడుతున్నారు. అనంతపురం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఏఎస్ఓగా టీచర్ తలారి శ్రీనివాసులు పనిచేస్తుండేవారు. అయితే ఆయన ఇటీవల తన పోస్టుకు రాజీనామా చేసి తిరిగి బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు టీచర్ గా వెళ్లారు. దీంతో ఆ పోస్ట్ ఖాళీగా ఏర్పడింది. ఆ పోస్టులోకి మరొకరు వచ్చేంతవరకు ఆయన్ను అదే పోస్టులో డిప్యూటేషన్ మీద కొనసాగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పోస్టుకు గణితం స్కూల్ అసిస్టెంట్ మాత్రమే అర్హులు. అయితే జిల్లా విద్యాశాఖలో కీలకమైన ఏఎస్ఓ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆ పోస్ట్ కోసం ఉపాధ్యాయులు పోటీ పడుతున్నారు. జిల్లా కేంద్ర శివారులో ఉన్న తపోవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ కిష్టప్ప ఏఎస్ఓ పోస్ట్ కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో లెటర్ ఇవ్వడం జరిగింది. ఆయనకు ఇటీవల జరిగిన సమగ్ర శిక్ష సెక్టోరియల్ నియామకల్లో అవకాశం రాకపోవడంతో కోర్టుకు వెళ్లారు. కనీసం ఈసారైనా తనకు అవకాశం కల్పించాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా కుందుర్పి మండలం కనుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ ఆనంద్ కూడా లెటర్ ఇవ్వడం జరిగింది. ఈయన గతంలో జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో పనిచేశారు. అప్పట్లోఅనేక ఆరోపణలు రావడంతో ఆయనకు అప్పటి నుంచి ఇప్పటి వరకు అవకాశం కల్పించలేదు. ఈయనకు జిల్లా విద్యాశాఖకార్యాలయంలోపనిచేస్తున్న ఒక పర్యవేక్షకులు పూర్తిగా సహకారం అందిస్తుండడం తోనే అతను లెటర్ఇచ్చినట్లు జిల్లావిద్యాశాఖలో ప్రచారం జరుగుతుంది. అదేవిధంగా శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి ప్రాంతానికి చెందిన మరొక టీచర్ సాదిక్ ఉల్ల కూడా లెటర్ ఇచ్చినట్లు తెలిసింది.




**ఈసారైనా నిబంధనల ప్రకారం గా భర్తీ అయ్యేనా ? :** జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కీలకమైన ఏఎస్ఓ పోస్టుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా స్కూల్ అసిస్టెంట్ అర్హులు. కానీ ఇదివరకు ఏఎస్ఓగా పనిచేసే ప్రస్తుతము కూడా డిప్యూటేషన్ మీద అదే పోస్టులో కొనసాగుతున్న గణితం స్కూల్ అసిస్టెంట్ తలారి శ్రీనివాసులు ఆ పోస్టుకు అర్హులు కాకపోయినప్పటికీ ఓ ప్రజా ప్రతినిధి ద్వారా అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి ఆ పోస్టులోకి వచ్చారని ఉపాధ్యాయుల్లో చర్చ జరుగుతుంది. అప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు నిబంధన ప్రకారం గా ఆయన అర్హులు కాదని ఆ ప్రజాప్రతినిధికి చెప్పినట్లు సమాచారం. అయినా కూడా అతన్ని తీసుకోవాలని తీవ్రంగా ఒత్తిడి చేయడంతోనే అతన్ని తీసుకోవడం జరిగిందని జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉద్యోగులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఏఎస్ఓ పోస్టులోకి వచ్చిన ఆ టీచర్ పై గతంతో పాటు ఇటీవల కూడా పలు ఆరోపణలు వచ్చాయి. ఈనేపథంలో ఆయనను ఆపోస్టునుండి తొలగిస్తారని ముందుగానే భావించారు. అంతేకాకుండా రేష్నలైజేషన్ లో వెంకటాపురం జడ్.పి.హెచ్. ఎస్లో లో ఉన్న తన సబ్జెక్టు పోస్టు పోతుందని, అదే పోస్టులోకివెళితే మరోఎనిమిది సంవత్సరాలు ఉండవచ్చని, ఆ తర్వాత అక్కడే పదవీ విరమణ చేయవచ్చునని, లేకపోతే హెచ్ఎం గా ప్రమోషన్ వస్తే వెళ్లవచ్చు అని ముందస్తు ఆలోచనతో ఆయనే స్వయంగా రాజీనామా చేసి తిరిగి ఏ పాఠశాల నుంచి వచ్చారో అదే పాఠశాలకే వెళ్లడం జరిగింది. కనీసం ఈసారైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ ఎస్ ఓ పోస్టును భర్తీ చేస్తారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. దీనిపైన వివరణ అడగడానికి జిల్లా విద్యాశాఖ అధికారికి వార్త రిపోర్టర్ ఫోన్ చేయగా ఆయన మీటింగ్ లో బిజీగా ఉన్నానని సమాధానం ఇవ్వడం జరిగింది.

# యాక్షన్ ప్లాన్ తో నగరాన్ని పరిశుభ్రంగా మారుస్తాం

## జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెల్లడి



శానిటేషన్ పనులను స్వయంగా చేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆనంద్

**అనంతపురం క్రైమ్ , మే 23 ప్రభాతవార్త**

నెల రోజుల యాక్షన్ ప్లాన్ తో అనంతపురం నగరాన్ని పరిశుభ్రంగా మార్చబోతున్నామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలో శనివారం ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని సూర్య నగర్ రోడ్డు, ఐదవ సర్కిల్ మస్టర్ పాయింట్, గుత్తి రోడ్డు బస్ స్టాప్ వద్ద ఈ కార్యక్రమం ప్రారంభమైంది. బహిరంగ మూత్ర విసర్జన ప్రాంతాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి, కలెక్టర్ ఆనంద్ స్వయంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అనంతరం నగరంలో పరిశుభ్రతా చర్యలపై చేపట్టిన యాక్షన్ ప్లాన్ ను పరిశీలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. 30 రోజుల పాటు, 4 వారాల ప్రత్యేక ప్రణాళికతో రోడ్లు, డ్రైన్లు, మార్కెట్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ చేపట్టారని.. ఇక నుంచి ఏ ప్రాంతంలో ఎన్ని గంటలకు, ఎవరు చెత్త తీసుకెళ్లేందుకు వస్తారన్న వివరాలు ప్రజలకు ముందే చెబుతామన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి..ఆ సమయంలోనే చెత్త అందించేలా ప్రణాళిక చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక నాయకులు కూడా పాల్గొంటారన్నారు. ఎవరు ఎక్కడ ఏం చేస్తున్నారన్నది సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. ఏ రోజు కూడా నగరంలో పరిశుభ్రతా చర్యలు చేపట్టలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక అధికారిగా వచ్చిన మూడు నెలల్లో నగరంలో చాలా మార్పు కనిపిస్తోందన్నారు. రానున్న నెల రోజుల యాక్షన్ ప్లాన్ తో నగరంలో మరింత మార్పు చూస్తారని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా నగర పరిశుభ్రత విషయంలో కొంత వరకు మార్పు వచ్చిందని.. అయితే పూర్తి స్థాయిలో నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక ప్రణాళిక చేసినట్టు చెప్పారు. జిల్లాలో అన్ని మున్సిపాల్టీల్లో దీనిని అమలు చేయబోతున్నామన్నారు. ప్రతి కాలనీకి ఏ సమయానికి చెత్త సేకరణ జరుగుతుందన్నది ముందే చెబుతామన్నారు. చెత్త సేకరణకు వచ్చే సిబ్బంది పేరు, సచివాలయ సెక్రటరీ, శానిటరీ ఇన్స్పెక్టర్ వివరాలు కూడా ఉండే విధంగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. జీఐఎస్ మ్యాప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు కంట్రోల్ రూం కూడా పని చేస్తుందన్నారు. చెత్త తరలించే వాహనం వచ్చిన సమయంలోనే వారికి చెత్త ఇచ్చేలా ప్రజలు సహకరించాలన్నారు. ఎవరైనా చెత్త సేకరణకు రాకపోతే.. సెక్రటరీ లేదా శానిటరీ ఇన్స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వారు కూడా స్పందించకపోతే కంట్రోల్ రూంకి ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా ప్రజలు సహకరిస్తేనే నగరంలో పరిశుభ్రత సాధ్యమవుతుందన్నారు. ఓ వైపు పరిశుభ్రతా చర్యలు చేపట్టడంతో పాటు ప్లాస్టిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్ తో పాటు ఆశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## నాల్గవ వార్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్



కార్మికులతో కలిసి చెత్త శుభ్రం చేస్తున్న టీడీపీ వార్డు ఇంచార్జ్ అశోక్

హిందూపురం టౌన్ మే 23 ప్రభాతవార్త

హిందూపురం మున్సిపాలిటీ నాలుగవ వార్డు త్యాగరాజ నగర్ లో శనివారం ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎన్,టి అశోక్ కుమార్ మున్సిపల్ కార్మికులతో కలిసి వార్డులో చెత్త శుభ్రం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా వార్డులో చెత్త సేకరణ పరిశుభ్రత పనులు చేపట్టడం జరిగిందని అశోక్ తెలిపారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా వార్డులోని అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఈకేవైసీ చేసుకోకపోతే రైస్ కార్డు రద్దు

హిందూపురం టౌన్ మే 23 ప్రభాతవార్త

హిందూపురం మండలంలోని రైస్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆయా పరిధిలోని రేషన్ డీలర్ల వద్ద ఈ కేవైసీ చేయించుకోవాలని లేకపోతే రైస్ కార్డు రద్దు అవుతుందని తెలిపారు. హిందూపురం అర్బన్ పరిధిలో 64 చౌక ధాన్యపు దుకాణాలు, రూరల్ పరిధిలో 32 చాప ధాన్యపు దుకాణాలు ఉన్నాయని హిందూపురం అర్బన్ కు సంబంధించి 6233 మంది రైస్ కార్డు లబ్ధిదారులు, రూరల్ పరిధిలో 2406 మంది లబ్ధిదారులు ఇంకా ఈ కేవైసీ చేసుకోలేదని ఈనెల 25వ తేదీలోపు దగ్గరలోని చౌక ధాన్యపు దుకాణానికి వెళ్లి డీలర్స్ ద్వారా ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసిల్దార్ వెంకటేష్ తెలిపారు. గడువులోపు ఈ కేవైసీ పూర్తి చేయని రైస్ కార్డులను తొలగించడం జరుగుతుందని ఆయన అన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన టీడీపీ నేత ధర్మతేజ..

కంబదూరు, మే 23, ప్రభాత వార్త



అరటి పంటను పరిశీలిస్తూ రైతుకు భరోసా కల్పిస్తున్న ధర్మతేజ

మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కళ్యాణదుర్గం టీడీపీ నేత దేవినేని ధర్మతేజ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అండేపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు 5 ఎకరాల్లో సాగుచేసిన యాలక్కి అరటి తోట పూర్తిగా నేలకొరిగి భారీ నష్టం వాటిల్లింది. అలాగే ములకనూరు గ్రామానికి చెందిన మానుకుండ్ల వెంకటేశు ఆరు ఎకరాల్లో, సాగుచేసిన అరటి, బొప్పాయి, మంద కుర్లపల్లి గ్రామాల్లో సమతమ్మ అనే రైతు 7 ఎకరాల్లో సాగుచేసిన బొప్పాయి పంటలు కూడా వర్షాలకు నేలవాలిపోయి దెబ్బతిన్నాయి. దీంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచనల మేరకు దేవినేని ధర్మతేజ ఉద్యానశాఖ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి రైతుల పొలాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.ప్రభుత్వం తరఫున నష్టపోయిన ఇద్దరు రైతులకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



అధికారులు ,నాయకులతో కలిసి బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ధర్మతేజ

## భూ వివాద గొడవలో.. ఐదుగురు అరెస్ట్..

కంబదూరు, మే 23, ప్రభాత వార్త



మీడియాతో మాట్లాడుతున్న ఎస్సై లోకేష్

కంబదూరు మండలం తిప్పేపల్లి గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో జరిగిన గొడవ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై లోకేష్ కుమార్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఎరుకల గోవిందప్పపై అతని సోదరుడు సహా మరో నలుగురు కలిసి దాడికిపాల్పడినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు, నిందితులైన ఐదుగురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్ నిమిత్తం కళ్యాణదుర్గం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. భూ, ఆస్తి వివాదాలు తలెత్తినప్పుడు చట్టపరమైన మార్గాల్లోనే సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించారు. కోర్టులు లేదా ఆర్డీఓ కార్యాలయాల ద్వారా న్యాయం పొందాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల ప్రజలు శాంతియుత వాతావరణంలో సమస్యలను పరిష్కరించుకోవాలని, అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్సై లోకేష్ కుమార్ పేర్కొన్నారు.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్‌ను ప్రారంభించిన కమిషనర్

గుంతకల్లు, మే 23 ప్రభాతవార్త



క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.లక్ష్మీదేవి శనివారం పట్టణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలుగు అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరు గుడ్డ సంచులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా దుకాణదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇంటి వద్ద చెత్తను బయట పడేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రజలు క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగస్వాములై పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని కోరారు. అంతకుముందు కమిషనర్‌తో పాటు టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది చీపుర్లను చేతబట్టి రోడ్లను శుభ్రం చేశారు. ఇదిలా ఉండగా పట్టణాల పరిశుభ్రత లక్ష్యంగా శుభ్రమైన రోడ్లు, శుభ్రమైన డ్రైనేజీలు, శుభ్రమైన పరిసరాల కోసం ప్రభుత్వం కార్యక్రమాన్ని తెచ్చింది. ఈనెల 23 నుండి జూన్ 20 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, డిఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈలు హరికృష్ణ, ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, టిడిపి నాయకులు తలారి మస్తానప్ప, రాయల్ వెంకటేష్, గోవిందరాజులు, అశోక్‌కుమార్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్లను శుభ్రం చేస్తున్న అధికారులు, నాయకులు

## 2 ఈ ఆటోలు ఇచ్చిన దాత



వాహన పత్రాలు అందుకుంటున్న డా. సురేంద్ర

హిందూపురం టౌన్ , మే 23 ప్రభాతవార్త

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో బెంగళూరుకు చెందిన బి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సౌజన్యంతో మున్సిపాలిటీకి 2 ఈ ఆటోలు చెత్త సేకరణ కోసం అందజేశారు. కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రకు సంస్థ డైరెక్టర్ పూర్ణ వాహనాలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. పూజల అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కొక్క వాహనం 11 లక్షల రూపాయలు అని, మొత్తం రూ 22 లక్షల వ్యయంతో బిఎస్సార్ సంస్థ మున్సిపాలిటీకి ఈ వాహనాలను సమకూర్చిందని కమిషనర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏలు వీరయ్య, బాలాజీ, మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్, నాగరాజు, రాఘవేంద్ర, దుర్గా నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 120 మున్సిపల్ వర్కర్లకు దుస్తులు పంపిణీ

హిందూపురం టౌన్, మే 23 ప్రభాతవార్త



దుస్తులు అందిస్తున్న దృశ్యం

స్థానిక మున్సిపాలిటీలో పని చేస్తున్న 120 మంది వర్కర్లకు యూనిఫాం దుస్తులను శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, పిఏలు వీరయ్య బాలాజీ పాల్గొని లాంచనంగా వర్కర్లకు దుస్తులు అందజేశారు. మూడేళ్ల కు సంబంధించి యూనిఫామ్ దుస్తులను మూడేసి చొప్పున 10 లక్షల రూపాయల వ్యయంతో వర్కర్లే స్వయంగా ఎంపిక చేసిన దుస్తులను అందించినట్లు కమిషనర్ విలేకరులకు వివరించారు.

## బిసలమానేపల్లిలో ఫీడర్ ఛానల్ పనుల పర్యవేక్షణ

- "జలధార - జలహారతి" కార్యక్రమంలో భాగంగా తనిఖీ
- ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపిడిఒ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

లేపాక్షి, మే 23 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని బిసలమానేపల్లి గ్రామంలో "జలధార - జలహారతి" కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎంపిడిఒ శ్రీనివాసులు శనివారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. గ్రామంలోని ఓబులాపురం చెరువు నుండి కల్లూరు చెరువు వరకు ఉపాధి హామీ పథకం కింద అత్యంత ప్రాధాన్యతగా చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతా ప్రమాణాలను, కాలువ తవ్వకం సాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఫీడర్ ఛానల్ పనులను వేగవంతం చేయాలని, దీనివల్ల ఓబులాపురం చెరువు నుండి కల్లూరు చెరువుకు నీటి సరఫరా సజావుగా సాగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి, స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షిలో సోమవారం నుండి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

లేపాక్షి, మే 23 ప్రభాతవార్త

10వ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల కోసం వచ్చే సోమవారం నుండి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని శనివారం ఎంఈఓ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. లేపాక్షి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇందుకోసం ప్రత్యేకంగా ఏ, బి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా, ముందస్తుగానే తమ హాల్ టికెట్లతో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల వద్ద అన్ని రకాల మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

## తప్పిపోయిన బాబుని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ నాగ మధు

కనేకల్ మే 23 ప్రభాతవార్త

కనేకల్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో మాటలు సరిగా రాని ఒక అబ్బాయి తన తల్లిదండ్రుల నుండి తప్పిపోయి బస్టాండ్ లో ఏడుస్తూ స్థానికులు కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు బాబును స్టేషన్ లోకి తీసుకువెళ్లి సముదాయించారు. పోలీసులు వివిధ సోషల్ మీడియా గ్రూపుల్లో బాబు ఫోటో సమాచారాన్ని పంపించారు. నాగేపల్లి గ్రామానికి చెందిన ఎర్రి స్వామి కుమారుడు గౌతమ్ నీ ఎస్సై నాగ మధు ఆధ్వర్యంలో వాళ్ళ నాన్నకు పిల్లాడిని అప్పగించారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి తల్లిదండ్రులు పేరు పేరున ధన్యవాదములు తెలియజేశారు.

## స్వచ్ఛ పుట్టపర్తి లక్ష్యంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్" జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

శ్రీ సత్య సాయి జిల్లా, మే 23, ప్రభాతవార్త ప్రతినిధి:



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

స్వచ్ఛ పుట్టపర్తి లక్ష్యంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" మార్గదర్శకాల ప్రకారం పుట్టపర్తి మున్సిపాలిటీలో నాలుగు వారాల పాటు నిర్వహించే"ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం శనివారం గణేష్ సర్కిల్ నుండి ఎయిర్‌పోర్ట్ రోడ్డు వరకు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పుట్టపర్తిని పరిశుభ్రంగా ఉంచి ఖిస్వర్ణాంధ్రఖి లక్ష్యాన్ని సాధించాలన్నారు. శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య మౌలిక వసతుల బలోపేతం, ప్రజల భాగస్వామ్యం ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు. మే 23 నుండి జూన్ 19 వరకు నాలుగు వారాల పాటు ఈ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ, మున్సిపల్ ప్రత్యేక అధికారి సువర్ణ, మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు, డీఈఓ కృష్ణప్ప, మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, సచివాలయ మరియు మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాణహాని చేసినా భయపడను

**నకిలీ డాక్టర్ పై చర్య తీసుకోండి డాక్టర్ వెంకటరమణ**





మాట్లాడుతున్న డాక్టర్ బి.వి.రమణ

హిందూపురం మే 23 ప్రభాతవార్త

హిందూపురంలో ఎనిమిదేళ్లుగా ధన్య గ్లోరీ కంటి వైద్యశాల పేరుతో నకిలీ డాక్టర్ చేసిన వైద్య చికిత్సలు వికటించాయని, సత్యసాయి జిల్లా ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా తాను ప్రశ్నించినందున తనపై దాడి చేశారని డాక్టర్ వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం డాక్టర్లు మీడియా సమావేశం నిర్వహించారు. వెంకటరమణ మాట్లాడుతూ ధన్య గ్లోరీ హాస్పిటల్ యజమాని రఘునాథ్ ఈనెల 22న తాను నిర్వహిస్తున్న ప్రణయ్ చిన్నపిల్లల ఆసుపత్రికి వచ్చి తనను దుర్భాషలాడారని అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా తనపై ఉన్న బాధ్యతతో ప్రశ్నించానని స్పష్టం చేశారు. తనకు ప్రాణహాని చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని, ప్రాణం పోయినా వాటికి భయపడేది లేదు అని చెప్పారు. ఈ నకిలీ హాస్పిటల్ సంబంధించి గతంలోనే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదులు వెళ్లగా ఫిబ్రవరి నెలలో వైద్య బృందం తనిఖీకి వచ్చిందని ఆ సమయంలో ఆస్పత్రి నిర్వాహకులు పత్తా లేకుండా పోయారని చెప్పారు. ఆతర్వాత కూడా ఆస్పత్రి పేరును మార్చుకొని రోగులను మోసం చేస్తున్నారని సీనియర్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అశ్వర్థరెడ్డి, డాక్టర్ రోహిల్, తదితర డాక్టర్లు మండిపడ్డారు. ప్రజలు అప్రమత్తమై ఇలాంటి వారికి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ జక్కా నరేంద్ర కుమార్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ నరేష్, డాక్టర్ తేజ స్వరూప్, డాక్టర్ హరికృష్ణ తదితరులు పదుల సంఖ్యలో పాల్గొన్నారు. కాగా డాక్టర్ బి.వి రమణ పై దౌర్జన్యం చేశారని ఆరోపణలతో ధన్య గ్లోరీ ఆసుపత్రి యజమాని పై స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది.

## చేతి వేళ్ళ ఉంగరం దొంగలింపు

రొళ్ల మే 23 (ప్రభాతవార్త):

మండలంలోని హనుమంతనపల్లి గ్రామం అటవీ ప్రాంతం సమీపంలో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో శనివారం మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి చేతి ఉంగరాన్ని దొంగలించిన ఘటన చోటు చేసుకుంది. మండ్లలోని టీడీపల్లి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి అను వ్యక్తి ద్విచక్ర వాహనం ఆపి పోలీసు వారు వాహనాలు తనిఖీ చేయుచున్నారనీ బెదిరించారు. నీవద్ద రికార్డులు ఉన్నాయా లేకపోతె నిబండికి పోలీస్ వాళ్ళు ఫైన్ వేస్తారు అని బెదిరించారు. అతనితో మాట్లాడే క్రమంలో ద్విచక్ర వాహనం వెనుక వైపు కూర్చొని ఉన్న మరో వ్యక్తి తిమ్మారెడ్డి యొక్క షర్టు పట్టుకోగా, ముందు బైక్ నడుపుతున్న వ్యక్తి అతని ఎడమ చేతికి ఉన్న బంగారు ఉంగరంను లాక్కొని పారిపోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో తిమ్మారెడ్డి ఫిర్యాదు చేయగా ఎస్ఐ నరసింహుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఈ సంఘటనపై మడకశిర రూరల్ సిఐ రాజ్ కుమార్ వారి సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ముమ్మరం చేయాలని సిబ్బందికి సూచించారు.

## పట్టణ 4వ వార్డులో...సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

- టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి చేతుల మీదుగా పనులు ప్రారంభం



భూమి పూజ నిర్వహిస్తున్న తెలుగు తమ్ముళ్లు

గోరంట్ల, మే 23 ప్రభాతవార్త

గోరంట్ల మేజర్ పంచాయతీ 4వ వార్డులో పంచాయతీ గ్రాంట్ నిధుల కింద దాదాపు 5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణానికి టిడిపి మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, పాలసముద్రం, గౌనివారిపల్లి సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, రవిమోహన్, నాగేనాయక్, కురమాల జయరాం, గిరిధర్‌గౌడ్, అజ ంతుల్లా, నిమ్మల శ్రీధర్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, శ్రీనివాసులు, స్టోర్ డీలర్ శంకర్, నాగమణి, ప్రతాప్‌నాయుడు, సోమశేఖర్, బొబ్బిలి రామమోహన్, జనసేన రమేష్, శీనానాయక్, నూర్‌మహమ్మద్, జయకృష్ణ, నరేష్, తేజ, శ్రీశైలం శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న డాబా రమేష్ తండ్రి పాతన్న సంస్మరణ సభ..

కంబదూరు, మే 23, ప్రభాత వార్త



పాతన్న

కంబదూరు మండలం ప్రజా సంఘాల నాయకుడు డాబా రమేష్ తండ్రి పాతన్న సంస్మరణ సభను ఈ నెల 25వ తేదీన ములకనూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, అభిమానులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు.

## పదోన్నతి పొందిన ఏఎస్పీకి ఘన సన్మానం

హిందూపురం మే 23 ప్రభాతవార్త



సన్మానిస్తున్న సతీష్

అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన హిందూపురం డి.ఎస్.పి మహేష్ ను పలువురు ఘనంగా సత్కరించారు. శనివారం తెలుగుదేశం పార్టీకి చెందిన 18 వార్డు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సతీష్ కుమార్ తదితరులు డిఎస్పి కార్యాలయం వెళ్లి శాలువా కప్పి పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్, మాజీ ముతువల్లి నూరుల్లా ఖాన్ పుష్పగుచ్చం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



బొకే అందిస్తున్న ఆడిటర్ నూరుల్లా

## ప్రమాదవశాత్తు ఎలక్ట్రీషన్ మృతి

హిందూపురం మే 23 ప్రభాతవార్త

వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం గుడ్డం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనంలో ఎలక్ట్రీషన్ పనిచేస్తుండగా ఎత్తైన ఐరన్ స్టూల్ పైనుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి బాబా జాన్(31) అనే ఎలక్ట్రీషన్ తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. మరొకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. పట్టణంలోని ఎర్రకోట్టాలకు చెందిన మృతునికి భార్య, చిన్నారులైన కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## బీఎల్‌ఏల సమక్షంలో సర్వే కొనసాగించకుంటే సీఈసీకు పిర్యాదు చేస్తాం..!

-ఏకపక్షంగా చేపడితే ఉపేక్షించమన్న వైఎస్సార్‌సీపీ ప్రతినిధి ఏ.సి.ఎర్రిస్వామి-జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఎస్ఐఆర్-2026 కార్యక్రమం ఇంటింటి సర్వే-నియోజకవర్గ ఈఆర్వో, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి-1,200 ఓటర్లకు మించిన ఉన్న 26 పోలింగ్ స్టేషన్లను విభజిస్తున్నట్లు వెల్లడి





సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి, హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఉరవకొండ, మే 23 ప్రభాతవార్త

ఇంటింటి సర్వే సమయంలో కచ్చితంగా అన్ని పార్టీలకు సమాచారం అందించి బీఎల్‌ఏల సమక్షంలో కొనసాగించకుండా ఏకపక్షంగా నిర్వహిస్తే తాము నేరుగా ఢిల్లీకు వెళ్లి చీఫ్ ఎలక్షన్ కమీషనర్‌కు పిర్యాదు చేస్తామని ఈ విషయమై బీఎల్‌వోలకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రతినిధి ఏ.సి.ఎర్రిస్వామి అన్నారు. సర్వే ప్రారంభానికి ముందే తమకు సమాచారం అందిస్తే బీఎల్‌ఏలను వెంట పంపుతామన్నారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో భాగంగా 1,200 ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ స్టేషన్లను విభజించి పోలింగ్ స్టేషన్ల పేర్ల మార్పు, పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పు, క్లైముల పరిష్కార ం తదితర అంశాలను వివరించారు. విడపనకల్లు మండలంలో పోలింగ్ స్టేషన్-12 పొలికి, 16-కొట్టాలపల్లి, 26-విడపనకల్లు, 29-వి.కొత్తకోట, 38-కరకముక్కల, 40, 42, 45-పాల్తూరు, వజ్రకరూరు మండలంలో 51, 58-కొనకొండ్ల, ఉరవకొండ మండలంలో 121, 133-ఉరవకొండ, 147-వ్యాసాపురం, 148-నింబగల్లు, 152-పెద్దముష్టూరు, బెలుగుప్ప మండలంలో 185-ఎన్.గుండ్లపల్లి, 193-బెలుగుప్ప తండా, 200-జీడిపల్లి, 202-ఆవులన్న, 209-వెంకటాద్రిపల్లి, 210-శీర్పి, కూడేరు మండలంలో 225-ఉదిరిపి కొండ, 231-కలగళ్ళ, 238-ఇప్పేరు, 241-అరవకూరు, 250-కడదరబెంచి పోలింగ్ స్టేషన్లలో 1,200 ఓట్లు పైబడి ఉన్నాయని వాటిని విభజించడం జరుగుతుందని వివరిం చారు. పాల్తూరులోని 45 పోలింగ్ స్టేషన్‌ను గ్రామ సచివాలయం నుండి ఇందిరానగర్‌లోని ఎంపీపీ పాఠశాలకు మార్పు చేయాల్సి ఉందని తెలుపగా అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం తెలిపాయి. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి పార్టీ బీఎల్‌ఏల జాబితాను పార్టీ ప్రతినిధితో సంతకం చేయించి కార్యాలయంలో అందజేయాల ని ఈఆర్వో సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో చనిపోయిన ఓటర్ల తొలగించు విషయమై వారి కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేయకూడదని చనిపోయినట్లు నిర్ధారణ అయిన తరువాతే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, బెలుగుప్ప, వ జ్రకరూరు తహశీల్దార్లు పాటిల్ భోగనగౌడ్, బి.అనీల్‌కుమార్, నరేష్‌కు మార్, విడపనకల్లు ఆర్ఐ పోతన్న, కూడేరు జూనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ అశ్వర్థనారాయణ, టీడీపీ ప్రతినిధులు పి.రాజేష్, ఎం.రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు ఈడిగ ప్రసాద్, ఏ.సి.ఎర్రిస్వామి, మేకల సిద్దప్ప, జి.ఎర్రిస్వామిరెడ్డి, బి.యోగేంద్రరెడ్డి, బీజేపీ పార్టీ ప్రతినిధి ఎం.హరిప్రసాద్‌చౌదరి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సోనియా శీన, ఇంద్రావతి ఓబులేసు, జనసేన పార్టీ ప్రతినిధి ఎం.చంద్రశేఖర్, సీపీఐ పార్టీ ప్రతినిధి ఎం.బి.చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

అనంతపురం, మే 23 ప్రభాతవార్త బ్యూరో

స్థానిక శ్రీనివాసనగర్ శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అర్చన మహా మంగళారతి అనంతరం తీర్థప్రసాద్ వినియోగం జరిగింది. అలాగే కీర్తిశేషులు ఆళ్లగడ్డ రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం శ్రీ వెంకటేశ్వర స్వామి వైభవం 500 బుక్కులు భక్త మహాశయులకు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాముతో పాటు ప్రసాద్ నాగరాజు సురేష్ అనిల్ రామ్ మూర్తి మహీంద్రా తదితరులు పాల్గొన్నారు.

## మహతి లలిత్త సంగీత పాఠశాలలో సంగీత సత్సంగం

అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త



సత్సంగం నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక రెండవ రోడ్డులో ఉన్న మహతి లలిత సంగీత పాఠశాలలో సంగీత సత్సంగం నిర్వహించారు. ఇందులో ప్రముఖ సంగీత దర్శకులు, మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజ సంగీత దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలు గాయనీ గాయకులు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో మహతి సంగీత పాటశాల నిర్వాహకులు, ప్రముఖ గాయకులు కె.వి.మహీధర్, సాయి విజ్డాన్ స్కూల్ అధినేత యం.పి.శ్రీనివాసులు, విశ్రాంత గ్రామీణ బ్యాంకు మేనేజర్ జె.వేంకటేశ్వర్లు, సంగీత గురువు మాధవి, రాధ, నాగరాజు, ఈశ్వరయ్య, నారాయణ స్వామి, కెనరా బ్యాంకు మేనేజరు దివ్య, నిర్మల తదితరులు పాటలు పాడి అలరించారు. ఇందులో భాగంగా తరలి రాద తనే వసంతం, అందాలలోఅహో మహోదయం, ఓ ప్రియా ప్రియా, ఎన్నోరాత్రులొస్తాయి గాని, ప్రేమ ఎంత మధురం,శుభలేఖ వ్రాసుకున్న, కలయా నిజమా, జిలిబిలి పలుకుల తార, సీతా సీమంతం, ఖజురహోలో, ప్రేమ లేదని లాంచి పాటలు పాడారు.

## గంజాయి, ఎండిఎం డ్రగ్ స్వాధీనం..ముద్దాయిల అరెస్టు

రాప్తాడు, మే 23 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాప్తాడు సిఐ గంజాయి, ఇతర మత్తుపదార్థాల సరఫరాదారులపై గట్టి నిఘా ఉంచి శనివారం మధ్యాహ్నం వాహనంలో తనిఖీ చేయుచుం డగా గంజాయి ఎండిఎం డ్రగ్ కలిగి ఉన్న అమీర్ భాష, పెద్ద భాస్కర్ పవన్, బోనాసి శ్రీహరిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి ఒక కేజీ గంజాయి, రెండు గ్రాముల ఎండిఎం డ్రగ్, 20 గ్రాముల హైడ్రోగంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకొని ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరు పరచినట్లు సిఐ తెలిపారు.

## అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదు

అనంతపురం కల్చరల్, మే 23 ప్రభాతవార్త

విజయ్ అకాడమీ డైరెక్టర్ విజయ్ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ తోటి అకాడమీలపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని పలు ఎడ్యుకేషన్ అకాడమీ నిర్వాహకులు గిరీష్ కుమార్, సంగమేష్, అఖిలేష్ నాయుడు పేర్కొన్నారు. విజయ అకాడమీ అబద్ధపు ప్రచారాలతో ఎస్సీ, ఎస్టీల విద్యార్థులకు ఉచిత హాస్టల్, కోరిన కాలేజీలలో సీట్లు ఇప్పిస్తానంటూ మభ్యపెడుతూ విద్యార్థుల నుండి వేలాది రూపాయల దండుకుంటూ తప్పుడు వాగ్దానాలతో మోసం చేస్తున్నాడని అకాడమీ జేఏసీ నాయకులు ఆరోపించారు. నగరంలోని తప్పుడు ప్రచారాలతో ఎంతకాలం మోసం చేస్తావంటూ వారు ప్రశ్నించారు. నిరుద్యోగులు నగరంలో దాదాపు 30 ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నామని, తాము ఏనాడు తప్పుడు వాగ్దానాలు, తప్పుడు ప్రచారాలతో విద్యార్థులను, తల్లిదండ్రులను మభ్య పెట్టలేదని వారు స్పష్టం చేశారు. ముున్ముందు ఇలాంటి పరిస్థితులే కొనసాగితే తాము జిల్లా ఉన్నతాధికారులకు విజయ్ అకాడమీ మోసాలపై లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రమణ, నరసింహ, చంద్ర, లోకేష్, రుద్ర, రామ్మోహన్, లక్ష్మీ నరసింహ, అక్కులప్ప, పురుషోత్తం నాయక్, మురళి, కీర్తి, మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## టెలికాం రంగం అభివృద్ధి దశగా అడుగులు

**- టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు**

**- కమిటీ సభ్యులుగా హాజరైన రాయల్ మురళి, ముత్యాల సాయినాథ్**

అనంతపురం, మే 23 ప్రభాతవార్త బ్యూరో



.ప్రతిపాదనలను అందజేస్తున్న దృశ్యం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంపీలు అంబికా లక్ష్మీ నారాయణ, బి.కె పార్థసారథి సూచనల మేరకు టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశం నగరంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి టెలికాం జనరల్ మేనేజర్ ముజీబ్బాషా అధ్యక్షత వహించా రు. కమిటీ సభ్యులు కంతా రాయల్ మురళి, సాయినాథ్, రామ బ్రహ్మయ్య, రామ్మోహా న్‌లు కమిటీ సభ్యులుగా హాజరయ్యారు. జిల్లాలో 13వేల ల్యాండ్ లైన్ కనెక్షన్లు ఉన్నాయని జిఎం సభ్యులకు వివరించారు. అలాగే 340 సెల్ టవర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. అదనంగా 76 సెల్ టవర్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కమిటీ మెంబర్ రాయల మురళి మాట్లా డుతూ బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఇద్దరు ఎంపీలు సంపూర్ణ సహకారాలు అందిస్తున్నారని ఆయన అభినందించారు. ప్రతిపాదనలు కూడా వెంటనే కార్యరూపం దాల్చనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఏ సెల్ టవర్ అందని మారుమూల గ్రామాలను ఎంపిక చేసి అక్కడ టవర్లు ఏర్పాటు చేస్తే ఆ గ్రామాల అభివృద్ధికి మనము ఎంతో దోహదం చేసిన వారమవుతామని ఈ సందర్భంగా రాయల్ మురళి పేర్కొన్నారు. కొత్తగా గుత్తి మండలం పి.ఎర్రగుడి, కళ్యాణదుర్గం, రొల్ల తదితరచోట్ల సెల్ టవర్లు ఏర్పాటు చేయనున్నారు.

## తిరుపతిలో ప్రారంభించిన అరసం 83వ వార్షికోత్సవం

అనంతపురం, మే 23 ప్రభాతవార్త బ్యూరో



వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అరసం సభ్యులు

ఏపీ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 83 వ వార్షికోత్సవం తిరుపతిలో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ 20వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు బి.ఈశ్వరరెడ్డి, ప్రతినిధులు చెట్ల ఈరన్న, డా.జూటూరు షరీఫ్, గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, వంకిరెడ్డి రెడ్డప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలు ఆదివారం సాయంత్రం ముగియనున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ సభల్లో అరసం రాష్ట్ర నూతన కమిటీని సైతం ఎన్నుకోనున్నట్లు వారు ప్రకటించారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో టిడిపి కార్యకర్త మృతి

శింగనమల, మే 23 ప్రభాతవార్త



గవ్వల శంకర (ఫైల్‌ఫోటో)

మండల పరిధిలోని కల్లుమడి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త గవ్వల శంకర శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. ఇతనికి భార్య అంజినమ్మ, కూతురు, కుమారుడు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పాల్గొంటూ గ్రామంలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఉండేవారని తెలిపారు.

## జగన్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చడానికే హత్యలన్న టిడిపి మతిమాలిన మాటలు !

అనంతపురం, మే 23 ప్రభాతవార్త బ్యూరో

జగన్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చడానికే వారి కుటుంబీకులను హత్యలు చేశారన్న టిడిపి నాయకులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్,సీఎం రమేష్ మతి లేని మాటలని జవైఎస్ఆర్సిపి జోనల్ అధికార ప్రతినిధి కె.వి రమణ మండి పడ్డారు. ఆయన శనివారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ.. హత్యా రాజకీయాలే వైయస్సార్ కుటుంబ నేపథ్య మంటున్న వీరి మాటలు దెయ్యాలు వేదాలు వల్లించి నట్లు ఉన్నాయి. సీఎం రమేష్ చెప్పి నట్లు వైయస్ రాజారెడ్డి నేపథ్యం దొంగతనాలు అయితే సీఎం రమేష్‌ది దొంగసారా వ్యాపారం కాదా? ఒకప్పుడు సీఎం రమేష్ కుటుంబం పరిస్థితి ఏమిటో రాయలసీమ ప్రజలకు తెలియదా? అన్నారు. రాయలసీమలో పూర్వం వ్యక్తి గతమైన కక్షలు ఉండేటివి, వాటికి మొట్టమొదట రాజకీయ రంగు పులిమింది వైయస్ కుటుంబమే అంటున్న కేశవ్ కుటుంబం నేపథ్యం పేదలకు చెందాల్సిన, ఈత చెట్లను, ఈత కళ్ళును దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని డబ్బులు సంపాదించుకొని, తనకు రాజకీయంగా అడ్డు వస్తారన్న వారిని మోసపూరితంగా తమ చేతులకి రక్తం అంట కుండా తుద ముట్టించడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

రాయలసీమ పాలెగాళ్ల నేపథ్యం కలిగిన కేశవ్ కుటుంబం, వీరి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేసిన పోరాటాన్ని మరిపించడానికి కేశవ్ చేసే కొంగ జపం కాదా? అన్నారు. వైసిపి గొడ్డలి పార్టీ అయితే టిడిపి వెన్నుపోటు పార్టీ ఎందుకు కాకూడదు? రాజా రెడ్డిని హత్య చేసిన వారి ఆస్తులు ధ్వంసం చేశారని,నిందితులలో అందరినీ చంపేశారని, హత్యకు మూల కారణమైన పార్థసారథిని వికలాంగుడిగా చేసేసారంటున్న వీరు,పార్థసారథి రెడ్డి మా టిడిపి నే అని ఎందుకు చెప్పడం లేదు? దీనిని బట్టి వెనకుండి రాజారెడ్డి గారిని మేమే హత్య చేయించామని ఒప్పు కున్నట్లేకదా? అని ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి మరణం ఎవరి ప్రభుత్వ హయాంలో జరిగింది? వివేకానంద రెడ్డిని నేనే హత్య చేశానని ఒప్పుకున్న ముద్దాయి దస్తగిరి ఎవరి దగ్గర ఉన్నాడు, ఎవరి అండతో దర్జాగా, జల్సాగా తిరుగుతున్నాడు? అది హత్యా ? ఆత్మహత్యా ? అనే విషయాన్ని ఎవరు తేల్చాలి, అప్పుడు అధికారంలో ఉన్న మీరు ఎందుకు తేల్చలేక పోయారు ? తేల్చలేదంటే దీని వెనుక మీరు ఉన్నట్లే కదా ? రాజశేఖర్ రెడ్డి మరణం ముందు చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడిన మాటలను జగన్ ఉటంకిస్తే మీకెందుకు ఉలికి పాటు ? ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని తెలిసి, అభివృద్ధి మాది విధ్వంసం మీది అందుకే 11 సీట్లు వచ్చాయంటున్న మీకు 2019లో 26 సీట్లు వచ్చాయంటే అప్పుడు మీరు 2014 నుండి 2019 వరకు చేసింది విధ్వంసమేనా..? అతి తెలివి మాటలు కుయుక్తులు, కుతంత్రాలు, టముకు టమారం గారడీలు చేసి గెలవడం కాదు, నిజమైన నాయకుడు ప్రజల మనసులను గెలవాలి అందుకే జగన్ ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు, మీరు అధికారంలో ఉన్నా ప్రజలు మిమ్ములను కన్నెత్తి చూడడం లేదు.ఇది నిజంగా ప్రజలు ఓడించిన ఓటమేనా? మీరు ఆత్మ విమర్శ చేసుకోవాలి,మీరు మారాలి, మంచి రాజకీయాలు చేయాలి, అప్పుడే సమాజానికి, ప్రజలకు మేలు జరుగుతుంది, లేకుంటే పాపి చిరాయువే.

## ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నూతన కార్యవర్గ ఎన్నిక

అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త

స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ నూతన జిల్లా కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు కాకి ప్రకాష్‌రావు అధ్యక్షతన అనంతపురం జిల్లా నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొనగా నూతన జిల్లా అధ్యక్షునిగా కె.వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శిగా సి.గోపాల్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా బిఏ శంకర్ మూర్తి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కేవీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా కె.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులుగా ఐదు మందిని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏడు మందిని జిల్లా కార్యదర్శిగా ఐదు మందిని, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లుగా 4 గురిని ఎన్నుకోవడం జరిగింది.





కె వెంకటరత్నం, సి గోపాల్ రెడ్డి

ఈ సందర్భంగా ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు మాట్లా డుతూ.. వెంటనే పిఆర్సి కమిషన్ వేసి ఐఆర్ను ప్రకటిం చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమా ండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో చల్లా శివాన ంద, మస్తాన్ వలీ, కుళ్లాయప్ప, సూర్యనారాయణ ,జి శ్రీనివా సులు, కోటేశ్వరరాజు, రాయ పాటి శివా, రామకృష్ణ మల్లారెడ్డి కే నాగేంద్ర తదితర జిల్లా నాయకులు ఈ సమావేశంలో ఎంటిఎస్ ఉపా ధ్యాయులు మునీంద్ర రామకృష్ణ, సురేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అఖిల భారత యువజన సమాఖ్య అనంతపురం జిల్లా సమితి

అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త

నిరుద్యోగతను రోజురోజుకీ పెంచిపోషిస్తున్న ఎన్డీయే కూటమి అని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. సంతోష్ కుమార్ విమర్శించారు. యువతకు రాజకీయ చైతన్యం అవసరం, జూన్ 1 నుంచి 5 వరకు పల్నాడు జిల్లా కోటప్పకొండలో జరిగే విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక, రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయండని ఆయన కోరారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కోట్రేష్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటప్పకొండ శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. సంతోష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళాయిస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కోట్రేష్, ఉపాధ్యక్షుడు ధనుంజయ్, అనంతపురం నగర అధ్యక్ష కార్యదర్శులు రియాజ్, ఆనంద్ బాబు, ఉరవ కొండ నియోజకవర్గ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, రాయదుర్గం నియోజకవర్గ కార్యదర్శి నాగ య్య, అనంతపురం నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి బండారు తేజ, రాంబాబు బుక్కరాయస ముద్రం మండల కార్యదర్శి బం డారు లోకేష్, షేక్ షామిఉల్లా, యువతేజ నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

## ముగిసిన జోన్ నాలుగు జిల్లాల ఉపవిద్యా శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు 2 శిక్షణ కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త

స్థానిక రామ్‌నగర్‌లోని సిటీ కన్వెన్షనల్‌హాల్‌లో అనంతపురం, శ్రీ సత్య సాయి, కర్నూల్, నంద్యాల జిల్లాల ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు 2 లకు పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్, టీచ్ టూల్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అనే అంశాలు పర్యవేక్షణ మీద ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీకృష్ణప్ప విచ్చేసి మాట్లాడుతూ.. నాలుగు జిల్లాల అధికారులు ఒకచోట కలిసి రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ద్వారా ప్రత్యక్షంగా శిక్షణ తీసుకోవడం అనేది చాలా మంచి విషయమని. ఈ మాత్రం దీనివల్ల ఉప విద్యాశాఖ అధికారులు మండల విద్యాశాఖ అధికారులకు అద్భుతమైనటువంటి శిక్షణ అందుతుందని తెలియజేశారు. అనంతరం పాల్ స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్రీ కిషోర్ బాబు మాట్లాడారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప, స్టేట్ రిసోర్స్ పర్సన్స్ కిషోర్ బాబు, నాగేంద్ర, విజ య్, అనంతపూర్ సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వేణుగోపాల్, అసిస్టెం ట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఫణిరాజు, సత్య సాయి సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్, నాలుగు జిల్లాల ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఇఓ శ్రీకృష్ణప్ప

## విద్యతోనే వాల్మీకుల ఉన్నత భవిష్యత్తు : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆకాంక్ష

అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త

విద్యతోనే వాల్మీకులకు సమాజంలో సముచిత గుర్తింపు లభిస్తుందని, ఉన్నత విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో రాణించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆకాంక్షించారు. శనివారం అనంతపురం నగరంలోని వాల్మీకి భవన్‌లో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.సి.అక్కులప్ప అధ్యక్షతన పది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 620విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాల్వ శ్రీనివాసులు వాల్మీకి సమాజం విద్యాపరంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లోని వాల్మీకి విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్య అందేలా సమాజంలోని విద్యావంతులు, ఉద్యోగులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎమ్.ఎల్.సి మంగమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు వివిధ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోనూ వాల్మీకులు రాణించి, ఆర్థిక స్వాలంబన సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేశ్, గుమ్మనూరు నారాయణస్వామి, పామిడి వీరా, కుంటిమద్ది రంగయ్య, అపెక్స్ తిరుపాలు, అమరావతి ముత్యాలు, సిద్దార్థ ఆసుపత్రి డాక్టర్ శంకరనారాయణ, వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ. చైతన్యకుమార్, ట్రెజరర్ జి. పవన్ కుమార్, డాక్టర్ నివేదిత, సాకే నరేష్, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

## మేకతోలు కప్పుకున్న తోడేలు కూడా నీలా నీతులు మాట్లాడదేమో.. ప్రకాష్ రెడ్డి

**- టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్**

అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త

మేకతోలు కప్పుకున్న తోడేలు కూడా నీలా నీతులు మాట్లాడదేమో.. ప్రకాష్ రెడ్డి అని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పరిటాల కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేస్తే నీ నాలుక కోస్తాం అంటూ హెచ్చరించారు.

పాపంపేట పాపం నీతోనే మొదలు అయిందని, దానికి సాక్ష్యం మాశినేని గ్రాండ్ హోటల్ అన్నారు. వైసీపీ పార్టీని అడ్డంపెట్టుకొని రాజకీయ లబ్ది కోసం కులాలు మధ్య గ్రామాల్లో గొడవలు పెడుతున్నావ్ కాబట్టే నీకు గన్ మ్యాన్ తొలగించారన్నారు. ప్రకాష్ రెడ్డి నీలాంటి వాన్ని జిల్లా నుంచి భాహిస్కరించాలి అప్పుడే గ్రామాలు బాగుంటాయి, అభివృద్ధి కూడా చెందుతా యన్నారు. పరిటాల సునీతమ్మ ఎమ్మెల్యే అయిన వెంటనే రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించిన కుటుంబం పరిటాల కుటుంబం... పరిటాల సునీతమ్మ వేసిన రోడ్డుపై నడుస్తూ పరిటాల కుటుంబంపై తప్పుడు నిందలు వేస్తున్నావ్ ప్రకాష్ రెడ్డి దగ్గర్లో తగిన మూల్యం చెల్లించుకుంటావ్ ప్రకాష్ రెడ్డి అని బండి పరశురామ్ పేర్కొన్నారు.



బండి పరశురామ్

## శాశ్వత నీటి భద్రతను సాధించటమే జలధార జలహారతి ముఖ్యఉద్దేశ్యం

**- దేవరపల్లి గ్రామసభలో ఎంపీడీఓ తేజోష్ణ**

పామిడి, మే 23 ప్రభాతవార్త

వర్షపు నీటిని ఒడిసిపట్టి సంరక్షించటం చెరువులు కుంటల పునరుద్దరణ ద్వార భూగర్భ జలాలను పెంపొందించటం శాశ్విత నీటి భద్రతను సాధించటం తద్వార త్రాగు, సాగునీటి కొరత లేకుండా చూడటమే జలధార జలహారతి ముఖ్యఉద్దేశ్యమని ఎంపీడీఓ తేజోష్ణ పేర్కొన్నారు. మండల పరిదిలోని దేవరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం నందు శనివారం ఎంపీడీఓ తేజోష్ణ అధ్యక్షతన జలధార జలహారతిపై గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో చెక్‌డ్యామ్, కాలువలు, కుంటల్లో పూడిక తీసివేత, భవన నిర్మాణాల పనులపై చర్చిస్తూ ప్రజలు దాతలు బాగస్వాములై వీటిని పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమమే జలధార జలహారతి అని నీటిని నిల్వ చేయటం ద్వార ప్రజలకు త్రాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించటం, ఆహ్లాదకరమైన వాతారణాన్ని కల్పించటం ప్రధాన లక్ష్యం అన్నారు. జలధార జలహారతిని అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్న క్రమంలో భూగర్భ జలాల పెంపొందించటం కోసం ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఎంపీడీఓ తేజోష్ణ పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ బాలరంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మునీంద్ర, విఆర్ఓ సునీతాబాయి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డు అసిస్టెంట్ పెద్దన్న, టిడిపి నాయకులు దేవదాస్, నాగేష్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజోష్ణ.

## ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సనగాని సంజయ్

శింగనమల, మే 23 ప్రభాతవార్త



అవార్డు అందుకుంటున్న సన్నగాని సంజయ్

మండల కేంద్రంలోని బోయ వీధిలో సన్నగాని బాలకృష్ణ-విజయ్‌ల కుమారుడు సనగాని సంజయ్ ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఎంపిసిలో 963 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేతులు మీదుగా సనగాని సంజయ్ ప్రతిభా అవార్డు అందుకున్నారు.

## రుషిస్పంగముని జ్ఞాపకార్థం అన్నదానం

శింగనమల, మే 23 ప్రభాతవార్త



అన్నదానం చేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ జాతీయ రహదారి వద్ద శనివారం రుషిస్పంగమహాముని, శ్రీ గంపమల్లయ్య స్వామి, శ్రీ రంగరాయులు జ్ఞాపకార్థం 47వ శనివారం వడ్డే నాగరాజు ఆధ్వర్యంలో పలువురు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు రామ్‌చరణ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ భాస్కర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పెద్ద మట్లగొంది సురేంద్ర, చక్రాయుపేట శివారెడ్డి, కాయల రవి, గురుస్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై గ్రామస్తులకు అవగాహన

శింగనమల, మే 23 ప్రభాతవార్త



.గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ కౌలుట్లయ్య

మండల పరిధిలోని బండమీద పల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మహిళల భద్రతపై గ్రామస్తులకు శింగనమల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అవగాహన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగాజియ కట్టడి, సైబర్ నేరాల నియంత్రణ తదితర అంశాల్లో ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలని, మహిళలు, చిన్నారుల భద్రతపై కచ్చితంగా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండేలా వారికి తెలియజేసినట్లు, ముఖ్యంగా స్త్రీ రక్ష పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. శక్తి యాప్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన చేస్తూ ఆపదలో ఉన్న మహిళల భద్రత, రక్షణ కవచం వంటి యాప్‌లను ప్రభుత్వం రూపొందించిందన్నారు. అక్రమ మద్యం, పేకాట, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లరాదని సూచించారు. ముఖ్యంగా ఫ్యాక్షన్ జోలికి వెళ్తే తీవ్రంగా నష్టపోతా రని, గ్రామస్తులు ప్రశాంతంగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు శింగనమల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీలో పారాక్వాట్ డైక్లోరైడ్ 24 ఎస్ఎల్‌పై 60 రోజుల నిషేధం - ఏవో వెంకట్ కుమార్.

అనంతపురం రూరల్, మే 23 ప్రభాతవార్త



ఏవో వెంకట కుమార్

రాష్ట్రంలో ప్రజారోగ్యం, రైతుల భద్రత దృష్ట్యా పారాక్వాట్ డైక్లోరైడ్ 24 శీలి అనే కలుపు నివారణ మందుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 60 రోజుల పాటు తాత్కాలికముగా నిషేధం విధించడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై మందు పై వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధం 2026 మే 22 నుంచి అమలు లో ఉంటుంది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ మందును అమ్మడం, నిల్వ చేయడం, పంపిణీ చేయడం, తయారు చేయడం మరియు వినియోగించడంనిషేధించబడింది. ఎవరైనా అమ్మినచో కీటకనాశక చట్టం 1968లోని సెక్షన్ 27(1) మరియు సెక్షన్ 3(ఈ) ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారాక్వాట్, డైక్లోరైడ్అధికవిషపూరితమైన రసాయనమని, దీనికి విరుగుడు లేకపోవడంతో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువలనఈకలుపుమందునురాష్ట్రంలోనిషేధించబడినది ఇది రైతు సోదరులు గమనించవలెను అని తెలియజేయడమైనది. అదేవిధంగా డీలర్లు స్టాక్ ను అమ్మకాలను నిలిపి వేయాలి నిషేధిత పారాక్వాట్ అమ్మడం జరిగితే లైసెన్స్ లు రద్దు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## పారా క్వా ట్ పార్మ్ లేషన్ 24 యస్ యల్ స్టాఫ్ సేల్ చేశాం.

అనంతపురం రూరల్ మే 23 ప్రభాతవార్త :



స్టాకును పరిశీలిస్తున్న ఏవో వెంకట కుమార్.

డైరెక్టర్ వ్యవసాయ శాఖ వారి ఆదేశాలమేరకు నిషేధిత పారాక్వాట్ ఫార్ములేషన్ 24 శీలి స్టాప్ సేల్ ను మండలం ఉన్న అందరు డీలర్లు కు ఇవ్వడం జరిగిందని ఏ ఓ వెంకట్ కుమార్ తెలిపారు. శనివారం అనంతపురం రూరల్ మండలం వ్యాప్తంగా 25 డీలర్స్ దుకాణలలో గల 7694 లీటర్లు స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగిందని అయన తెలిపారు.

## జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మే 23 ప్రభాతవార్త

జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జూనియర్ క్రీడాకారులకు ఎమ్మెల్యే కందికుంట వెంక టప్రసాద్ అభినందించారు. శనివారం తన కార్యాలయంలో రూ.50వేలు విలువ చేసే కిట్లను చిన్నారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబర్చి మన కదిరి ప్రాంతానికి వన్నె తెచ్చారన్నారు. క్రీడాకారులు సాధించిన విజయాలు, ఈ ప్రాంత పిల్లలు, యువతకు స్పూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌సి సభ్యులు, ఆర్డిఓ వివిఎస్ శర్మ, డిఎస్పీ శివనారాయణస్వామిలు పాల్గొన్నారు.

**పేరు మార్పు**

నేను గుగ్గిళ్ళ నరసింహులు, తండ్రి:గుగ్గిళ్ళ రాముడు డోర్ నెంబర్: 4-739,5వ రోడ్డు, భవాని గుడి దగ్గర, అనంతపురం 515004, ఆంధ్రప్రదేశ్ నేను నా కుమారుడు ఆధార్ నెంబర్: 744642562427, పేరును గోగార్య హేమ్ రాజ్ కుమార్ పేరును **గుగ్గిళ్ళ హేమ్ రాజ్ కుమార్**గా మార్చుచున్నాను. ఇకపై అన్ని ప్రయోజనములకు **గుగ్గిళ్ళ హేమ్ రాజ్ కుమార్**గా పిలువగలరు.

**CHANGE OF NAME & SURNAME**

I, Khaza Pheer Koduru (Old Name) S/o. Kodur Madaar Saab, Resident of D.No. 6-673, Azad Nagar, Anantapur City, Anantapur District - 515 001, A.P. I have changed my name & surname from Khaza Pheer Koduru (Old Name) to **KODUR KHAJAPEER** (New Name). Henceforth, my name being called as **KODUR KHAJAPEER** for all purposes.

**CHANGE OF SURNAME**

I, Noorjahan Koduru (Old Name) W/o. Kodur Khajapeer, Resident of D.No. 6-673, Azad nagar, Anantapur City, Anantapur District - 515 001, A.P. I have changed my surname from Noorjahan Koduru (Old Name) to **KODUR NOORJAHAN** (New Name). Henceforth, my name being called as **KODUR NOORJAHAN** for all purposes.

04ATP23.qxd:04ATP23.qxd 24/05/26 10:49 PM Page 1



## ప్రజా సమస్యల పరిష్కారం కోసం

### - వాయిస్ ఆఫ్ సిటిజన్స్ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మే 23 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారానికి ఇక ఒక ఫోన్ కాల్ చాలు ప్రజల గొంతు నేరుగా ప్రజాప్రతినిధికి చేరే కొత్త వ్యవస్థకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శ్రీకారం చుట్టారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాసేవకు అనుసంధానం చేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఆధారిత ఐవిఆర్ఎస్ వ్యవస్థతో వాయిస్ ఆఫ్ సిటిజన్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను తెలపడానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని అమలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత తీసుకు రావాలని ఉద్దేశంతో వాయిస్ ఆఫ్ సిటిజన్స్ మీ సమస్య మా బాధ్యత మీ సమస్యకు పరిష్కారం మా కర్తవ్యం కార్యక్రమాన్ని రూపొందిం చామన్నారు. ఒక పౌరుడు తమ సమస్యను నేరుగా ప్రజాప్రతిని దృష్టికి తీసుకువచ్చిందికి ప్రవేశపెట్టిన కార్యక్రమం వాయిస్ ఆఫ్ సిటిజన్స్ అని ఎమ్మెల్యే తెలిపారు. సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్న తమ వద్దకు రావాలన్న ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఈ కార్యక్ర మాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మా సమస్యకు దారి చూపిస్తాడు అన్న నమ్మకం కల్పించడమే తమ లక్ష్యమని పేదవాడు మనుగడ సులభతరం చేయడా నికి ఈ కార్యక్రమం మొదలు పెట్టామని ఆచరణలో కష్టాలు రావచ్చు ఇబ్బందులు రావచ్చు అయినా దృఢ సంకల్ప ంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వాయిస్ ఆఫ్ సిటిజన్స్ పోస్టర్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి ఎస్ శర్మ, డిఎస్పి శివ నారాయణ స్వామి, ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ సందీప్, టిడిపి రాష్ట్ర నాయకులు పవన్ కుమార్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మదన్ కుమార్, మారుతి ప్రసాద్, కరీముల్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు




వాయిస్ ఆఫ్ సిటిజన్స్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

## భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించాలి : మంత్రి

### ఫజీలా స్కూల్ ను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్

ధర్మవరం రూరల్ మే 23 ప్రభాతవార్త

నేటి సమాజంలో సాంకేతికంగా ప్రగతి చెందినప్పటికీ... భావితరాలకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించి బంగారు భవిష్యత్తును అందించాలి. అని రాష్ట్ర కుటుంబ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యా దవ్, పాఠశాల యాజమాన్యానికి సూచించారు. శనివారం ధర్మవరం మండ లం నాగులూరు గ్రామంలో ఫజీలా ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రారంభో త్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. మంత్రితో పాటు వేరువేరుగా హాజరైన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ప్రముఖ చేనేత పారిశ్రామికవేత్త, తెలుగుదేశం నాయకులు సంధా రాఘవ, మాజీ మంత్రి శంకరనారాయణ లు పుష్పగుచ్ఛం అందించి సాధారణంగా ఆ పాఠశాల యాజమాన్యా న్య స్టార్ ఖలీల్, అస్లాం, ముక్తార్, సైఫుల్లా, అక్రమ్, షాహుల్ లు స్వాగతం పలికారు. అనంతరం అంగరంగ వైభవంగా మంత్రి చేతుల మీదుగా పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలను నిర్మాణం చేయడం ఎంతో హర్షనీయమన్నారు. విద్యార్థులకు విలువైన బోధన బోధించి పాఠశాల పేరు ప్రఖ్యాతలు నలుమూలల వ్యాపిం చేలా పాఠశాల యాజమాన్యం కృషి చేయాలని మంత్రి కోరారు. సాంకేతికంగా విద్యార్థులు తీర్చి దిద్దాలని సూచించారు. విద్యా ర్థులను తరగతి గదికే పరిమి తం చేయకుండా క్రీడలో పట్ల విద్యార్థినీ, విద్యార్థులకు తర్ఫీ దీ ఇవ్వాలని ఆయన తెలిపారు. అనంతరం ఆ పాఠశాల డైరెక్టర్లు మాట్లాడుతూ... సమా జం మారుతున్న కొద్ది విద్యార్థు ల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో డిజిటల్ విద్యా బోధన, విలువలతో కూడిన బోధన అందిస్తామని వివరించారు. అదేవిధంగా ప్రతి తరగతి గదికి ఏసీ సౌకర్యం కల్పించినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

## ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉండే ఏకైక పార్టీ తెలుగుదేశం

### - సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత - 15 మందికి రూ.14 లక్షల రూపాయల చెక్కుల అందజేత - మహానాడును విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపు

రామగిరి, మే 23 ప్రభాతవార్త

ప్రజలకు కష్టం వచ్చినా, కార్యకర్తలకు కష్టం వచ్చినా ముందుగా స్పందించేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలోని పలువురికి ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రామగిరి పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొ త్తపల్లి మండలాలకు చెందిన 15మంది లబ్ధిదారులకు సుమారు 14లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బం దులు పడుతున్న వారిని సీఎం ఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు కష్టం ఉందంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పంది స్తున్నారన్నారు. ఇప్పటికే 23 నెలల్లో 1290 మందికి రూ. 9.82 కోట్ల మేర సాయం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం అనం తరం పార్టీ నాయకులతో సమా వేశం నిర్వహించారు. ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించ బోయే మహానాడుకు సంబంధి ంచి ఎమ్మెల్యే సునీత కీలక సూచనలు చేశారు. పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి వర్చువల్ గా మహానాడు ఉంటుం దని.. ప్రతి క్లస్టర్ పరిధిలోని వారు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. మండల నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు ప్రత్యేకంగా చొరవ తీసుకొని క్లస్టర్ పరిధిలో ఎల్ఈడి స్క్రీన్ల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త మహానాడులో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన దృశ్యం

## పార్టీ పటిష్టతకు..స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

### - టిడిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ - జూమ్ మీటింగ్‌లో పార్టీ కన్వీనర్‌కు ఆదేశాలు

గుత్తి, మే 23 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేస్తూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేసేలా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని టిడిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయన శనివారం 15 వేల మంది పార్టీ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భ ంగా రాష్ట్రంలోని గజపతినగరం, రాజోలు, గుత్తి పార్టీ కన్వీనర్లతో మాట్లాడా రు. ఈ సందర్భంగా కన్వీనర్ కెఎం చౌదరితో ఆయన జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ పార్టీలో ఉన్న సీనియర్లను, పార్టీ కోసం కృషి చేసే కార్యకర్తలను సమన్వయం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు ప్రజల ఆకాంక్షలు ఏమున్నాయో తెలుసుకోవాలని సూచి ంచారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్య కర్తకు గుర్తింపునిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కన్వీనర్ కెఎం చౌదరి మాట్లా డుతూ ఈ నెల 27, 28న జరుగనున్న మహానాడు కార్యక్రమాన్ని పురస్కరి ంచుకొని, పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభ్యున్నతికై కృషి చేస్తున్న 9 మంది సీనియర్లను ఘనంగా సన్మానిస్తున్నామని, ముస్లింల పర్వదినం బక్రీద్ పురస్కరించుకొని టిడిపి ముస్లిం మైనార్టీ నేతలను సత్కరిస్తూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనిస్తామని ఆయన నారా లోకేష్‌కు తెలిపారు. వర్చువల్ విధానంలో రెండు రోజుల పాటు జరిగే మహా నాడు కార్యక్రమంలో భాగంగా కార్యక ర్తల సౌకర్యార్థం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో, మార్కెట్ యార్డు ప్రాంగణం లో ఎల్ ఇడి స్క్రీన్లతో వీక్షించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నామని కన్వీనర్ వివరించారు. అందుకుగాను ఆయన చౌదరిని అభినందించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో గుమ్మ నూర్ ఈశ్వర్ పర్యవేక్షణలో పార్టీ అభివృద్ధికి అన్ని విధాల తగు చర్యలు చేపట్టామని చౌదరి వివరించారు. రాష్ట్రంలో నారా లోకేష్ కేవలం ముగ్గురితో మాట్లాడగా అందులో జిల్లాలో కేవలం గుత్తి పార్టీ కన్వీనర్ చౌదరికి అవకాశం లభించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. గుంతకల్లు నియోజ కవర్గానికి నారా లోకేష్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.



పార్టీ కన్వీనర్ చౌదరి జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న దృశ్యం

## ప్రజల భద్రతే... ప్రధాన లక్ష్యం

### - అర్ధరాత్రి వేళ పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ - నైట్ బీట్, పెట్రోలింగ్ విధులను స్వయంగా పరిశీలించిన - జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

కదిరి, మే 23 ప్రభాతవార్త

ప్రజల రక్షణ, నేరాల నియంత్రణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు మరింత పటిష్టం చేయడం రాత్రివేళలో నేరాలు నివారణకు ముందస్తు చర్యలు భాగంగా శుక్రవారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కదిరి అర్బన్, నల్లచెరువు పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హాజరు, బాధ్యతలు నిర్వహణ నైట్ బీట్ వ్యవస్థ పనితురును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం బీట్ పాయింట్లు పెట్రోలింగ్ ప్రాంతాల్లో పర్యటించి భద్రతా చర్యలు గస్తీ నిర్వహణపై సమీక్షించారు. జిల్లా కేంద్రంలో కమ్యూనికేషన్ వ్యవస్థ ఎలా కొనసాగుతుంది అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం రాత్రి గస్తీ నిర్వహణ అనుమానితుల కదలికలపై సమాచార సేకరణ వంటి అంశాలపై అధికారు లకు పలు సూచన చేశారు. గస్తీ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో ఎస్పీ నేరుగా మాట్లాడి ప్రజల భద్రత విషయంలో అప్రమత్తంగా వివరించాలని రాత్రి సమయాలు మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. రాత్రి వేళల్లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల వివరాలు నమోదు చేయడంతో పాటు అవసరమైతే వేలిముద్రలు సేకరించాలన్నారు అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు దొంగతనాలు ఇతర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా కొనసాగించా లని ఎస్పి స్పష్టం చేశారు. అత్యవసరం ఉంటే తప్ప అనవసరంగా రాత్రి వేళల్లో బయట తిరగవద్దు అని ప్రజలకు సూచించారు అనుమాన స్పద కదిలికలు గమనించడం వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేయాలన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట డి.ఎస్.పి శివ నారాయణ స్వామి, పట్టణ సీఐ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



నైట్ బీట్‌లను స్వయంగా పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

## నీ చరిత్ర ఏంటో ప్రజలకు తెలుసు రప్పా రప్పా అని నరికితే తప్పేంటి అని అనలేదా?

### శాంతి దూతనని చెప్పుకుంటే ప్రజలు ఎవరు నమ్మరు - నీ సిద్ధాంతం విధ్వంసం మా సిద్ధాంతం అభివృద్ధి విలేకరుల సమావేశంలో మాజీ సీఎం జగన్ పై మండిపడ్డ మంత్రి సవిత

పెనుకొండ మే 22 ప్రభాతవార్త

పరిటాల రవి ని, వివేకానందరెడ్డిని చంపిందెవరో ప్రజలకు తెలుసు రాజారెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చరిత్ర తెలియని వారెవ్వరూ లేరు. నువ్వు మదర్ థెరిస్సాలా శాంతి దూతనని చెప్పుకుంటే నమ్మేవాళ్లెవరూ లేరు.నీ సిద్ధాంతం విధ్వంసమైతే మాది అభివృద్ధి సిద్ధాం తం అని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఫ్యాక్షని జాన్ని అంతం చేసి, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. పెనుకొండ పట్టణంలో శనివారం నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, వైయస్ జగన్, ఆయన తాత, తండ్రి చరిత్ర ఏంటో ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎటువంటి వారో ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని చూసి చెప్పొచ్చునన్నారు. తాను గాంధేయ వాదనని, మదర్ థెరిస్సాలా శాంతిదూతని జగన్ చెప్పుకుంటుంటే జనాలు నవ్వుతున్నారని అన్నారు. అయిదేళ్ల పాలనా కాలంలో రాయలసీమలోగాని, రాష్ట్రంలోని ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటు చేశారా..? అని జగన్ ను మంత్రి సవిత ప్రశ్నించారు. ఎన్టీఆర్ రాకతోనే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్య లభించిందని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో ఫ్యాక్షని జాన్ని అంతమొందిం చిన ఘనత సీఎం చంద్రబా బునాయుడిదేనన్నారు.విద్యకు, అభివృద్ధికి ప్రాముఖ్యతినిచ్చి, ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలప డానికి సీఎం చంద్రబాబు రేయి ంబవళ్లు కృషి చేస్తున్నార న్నారు. తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23 నెలలో కాలంలో రూ.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. తమ నాయకులది,తమ చరిత్ర క్లీన్ గా ఉందని, జగన్ హయం దోపిడితో సాగిందని మంత్రి సవిత అన్నారు. ఈ సమావేశంలో అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, టిడిపి నాయకులు త్రివేంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ నరసింహులు, టైలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత

## చెరువు కాలువలపై ..శ్రీ మంతుల...శ్రీ గంధం సాగు!..

### కంబదూరు సాకలి రేవు సమీపంలో భారీగా ఆక్రమణకు గురైన చెరువు ఆయకట్ట కాలువలు - భారీ వర్షాలు కురిస్తే చెరువు కట్ట కింద సాగు చేస్తున్న పంటలు మునిగిపోయే ప్రమాదం - కాలువలను కబ్జా చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు డిమాండ్ - గతంలో ధ్వంసమైన కల్వర్టు.. కాలువల ఆక్రమణలకు ప్రత్యేక సాక్ష్యం - అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే.. ఆక్రమణకు గురైన కాలువలను చూపిస్తా అంటున్న రైతు



.ఆక్రమణకు గురైన కాలువ స్థలాన్ని చూపుతూ మీడియాతో మాట్లాడుతున్న రైతు నాగరాజు



కాలువను కప్పేసి కంచె ఏర్పాటుచేసిన దృశ్యం



కాలువను కప్పేసి కంచె ఏర్పాటుచేసిన దృశ్యం

కంబదూరు, మే 23, ప్రభాత వార్త

కంబదూరు మండల కేంద్రంలో చెరువు ఆయకట్టు కాలువల ఆక్రమణ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది . మండల కేంద్రంలోని సాకలి రేవు సమీపంలో శ్రీగంధం పంట సాగు చేస్తున్న నిర్వాహకులు తమ పొలాల మీదుగా అనాదిగా ప్రవహిస్తున్న చెరువు కాలువలను అక్రమంగా మట్టితో పూడ్చి కంచెలు వేసి ఆక్రమించుకున్నారని వంటా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు కరణం నాగరాజు ఆరోపించారు.రైతుల కథనం ప్రకారం చెరువుకు అనుసంధానంగా ఉన్న కాలువలు గతంలో వర్షాకాలంలో అధిక నీటిని తరలించే ప్రధాన మార్గాలుగా ఉపయోగపడేవి. అయితే ఇటీవల శ్రీగంధం సాగు పేరుతో కాలువలపై మట్టిని కప్పేసి చెట్లు నాటడంతో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచి పోయిందని వారు వాపోతున్నారు.

ఫలితంగా భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు బయటకు వెళ్లే మార్గం లేక పంట పొలాలు, తక్కువ ప్రాంతాలు జలమయం అవుతున్నాయని అంటున్నారు.కాలువలు ఉన్న చోట ఇప్పుడు చెట్లు కనిపిస్తున్నాయి.నీరు వెళ్లాల్సిన దారిని మూసేయడంతో రైతుల పొలాలే మునిగి పోతున్నాయి అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలను ఆక్రమించడం వలన గతం లో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైన కల్వర్టు ప్రత్యేక సాక్షిగా కనిపిస్తోంది. అనాదిగా గ్రామ రైతాంగానికి ఉపయోగపడుతున్న కాలువలను కబ్జా చేయడం వల్ల భవిష్యత్తులో చెరువు కట్ట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ అధికారు లకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని రైతు కరణం నాగరాజు అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే ఆక్రమణకు గురైన కాలువలను చూపించేందుకు సిద్ధంగా ఉన్నాను. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు.మరోవైపు రాజకీయ అండదండలతోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మోనం వీడకపోవడంతో ఆక్రమణదా రులు మరింత రెచ్చిపోతున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేపట్టి ఆక్రమణకు గురైన చెరువు కాలువలను గుర్తించి పూడిక తొలగించి యథాస్థితికి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### - కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

గుంతకల్లు, మే 23 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. శనివారం రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ఇక్కడికి వచ్చిన ఆయన స్థానిక ఇల్లూరి లక్ష్మీనారాయణ భవన్‌లో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రతి కార్యకర్త కనీసం రోజుకు మూడు గంటలు పని చేస్తూ ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా నాయకులు స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాగసముద్రం శ్రీదేవి, పట్టణ అధ్యక్షులు వద్దే రమేష్, నాయకులు కొలిమి రామాంజనేయులు, హరిహా రనాథ్, పురంధర్, కొలిమి శేఖన్న, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

## మహానాడులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కండి

### - విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, మే 23 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యంకావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణం లోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో టిడిపి నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమం తొలిసారిగా పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నామన్నారు. పొదుపు చర్యలు అమలు చేయాలన్న ఉద్దేవ్యంతో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ పసుపు పండుగను సరికొత్త సాంకేతికతతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27, 28 తేదీలలో రెండు రోజులపాటు డిజిటల్ మహానాడు వేడుకలు జరగనున్నాయని, పార్టీ కేంద్ర కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో కార్యక్రమం ఉంటుందని, ఎన్టీఆర్ భవన్ నుంచి ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేసి మహానాడు ఆన్‌లైన్ కార్యక్రమాలు, పార్టీ తీర్మాణాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో క్లస్టర్ల వారీగా ప్రసారం చేస్తారన్నారు. వేడుకల్లో క్యాడర్, క్షేత్రస్థాయి నాయకులు పాల్గొనే విధంగా అధిష్టానం ఆదేశాలు ఇవ్వడం జరిగిం దని, క్లస్టర్ పరిధిలోని నాయకులు వేడుకల్లో పాల్గొనేలా చొరవ చూపాలని వర్చువ ల్ విధానంలో నిర్వహించే కార్యక్రమంపై అందరికీ అవగాహన కల్పించాలని, ప్రతి కార్యకర్త, నాయకులు డిజిటల్ మహానా డులో భాగస్వా ములై విజయవం తం చేయాలని కందికుంట పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు పాలవల పవన్‌కు మార్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్ భాను, కమ్మకార్పోరేషన్ డైరెక్టర్ మనోహర్‌నాయుడు, వాల్మీకి కృష్ణమూర్తి, టిడిపి నాయులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

## ఆపరేషన్ క్లీన్ స్వీప్ తో స్వచ్ఛ్ ఆంధ్ర సాధ్యం

### ప్రజల సహకారంతో క్లీన్ పెనుకొండ గ్రీన్ పెనుకొండ మంత్రి సవిత చెత్త ఊడ్చి చేతులతో ఎత్తిన మంత్రి సవిత

పెనుకొండ మే 22 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పెనుకొండ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ పెనుకొండ గ్రీన్ పెనుకొండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొని చెత్త ఊడ్చారు. స్వయంగా మంత్రి తన చేతులతో చెత్త తీసి డస్ట్ బిన్ లో వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, క్లీన్ పెనుకొండ గ్రీన్ పెనుకొండకు ప్రజలు సహకరించాలని పిలుపు నిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో పారి శుధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చేపట్టడం జరిగిం దన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల పరిశుభ్రత, రెండో వారంలో కాల్వల శుభ్రత, మూడో వారంలో చెత్త వేరు చేయడంపై అవగాహన, నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. పట్టణాలు పరిశుభ్ర ంగా ఉండాలంటే ప్రభుత్వం ఒక్కటే కాదు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత తీసుకోవాలి అని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, తహసి ల్దార్ స్వాతి, మున్సిపల్ అధికారు లు, మెప్మా సిబ్బంది,రాష్ట్ర యాద వ్ కార్పొరే షన్ డైరెక్టర్ కేశవయ్య, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డివారి మంజునాథ్ ,అర్బన్ టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, మం డల కన్వీనర్‌లు, ఈశ్వర్ ప్రసాద్ , వెంకటేశులు, పట్టణ మహిళా అధ్య క్షురాలు రమణమ్మ, టిడిపి నాయ కులు త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, ఎగువగడ్డ కృష్ణమూర్తి, బోయ శాపురం రాము, సుబ్రహ్మణ్యం, ప్రభంజనస్వామి ,సౌకత్, షమీ, చంద్రయుడు సోము, టీడీపీ నాయ కులు, స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులు,పారిశుద్ధ్య కార్మికులు పాల్గొ న్నారు.



చెత్త ఊడుస్తున్న మంత్రి సవిత

## సెలవు పై వెళ్లిన అనంతపురం డీఈఓ



అనంతపురం న్యూటౌన్, మే 23 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు ఆదివారం నుండి 15 రోజుల పాటు సెలవు పై వెళ్లడానికి శనివారము లెటర్ పెట్టడం జరిగింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ పై నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ డీఈవో పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో మనస్థాపం చెందినట్లు సమాచారం. అందులో భాగంగానే ఆయన 15 రోజులు సెలవు పై వెళ్లడానికి రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికాలతో అనుమతి కూడా తీసుకొని లెటర్ కూడా పెట్టడం జరిగింది. ఆదివారం నుండి అధికారికంగా సెలవు పై వెళుతుండడంతో ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారిగా అనంతపురం ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు కు బాధ్యతలు అప్పగిస్తున్నారు. శనివారం రాత్రి డిఇఓ అధికా రిక సిమ్ ను కూడా అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి గత ఏడాది నుండి ఆ పోస్టులో కొనసాగుతున్నారు. తీవ్ర పని ఒత్తిడి వలన ఆయన కు ఇటీవల గుండెపోటు వచ్చింది. గుండెకు స్టంట్ కూడా వేయడం జరిగింది. దీంతో 15 రోజులు సెలవు కూడా పెట్టడం జరిగింది. సెలవు తర్వాత జాయిన్ కావడానికి వస్తే ఆయనకు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వలేదు. అలా కొన్ని రోజుల తర్వాత జాయిన్ కావడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. ఆయన జాయిన్ అయిన తర్వాత విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్ పెంచడానికి ప్రభుత్వము ప్రత్యేక చర్యలు తీసుకుంది. అందులో భాగంగానే ప్రతిరోజు జిల్లా కలెక్టర్ రివ్యూ చేస్తున్నారు. శుక్రవారం కూడా టెలికాన్ఫరెన్స్ రివ్యూ చేయడం జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారి పనితీరుపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి మనస్థాపానికి గురయ్యారు. దీనికి తోడుగా ఆరోగ్యం సహకరించక పోవడంతో సెలవుపై వెళ్లడానికి నిర్ణయిం చుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత అధికారులతో అనుమతి తీసుకున్న తర్వాత ఆదివారం నుండి 15 రోజుల పాటు సెలవుపై వెళ్లడానికి లెటర్ పెట్టడం జరిగింది. ఆ తర్వాత కూడా జాయిన్ కారని, దీర్ఘకాలిక సెలవు పై వెళ్లడానికి గట్టి నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా విద్యాశాఖ అధికారి పై జిల్లా కలెక్టర్ అసంతృప్తితో ఉండడంతో మరొక అధికారిని రెగ్యులర్ గా నియమించడానికి విద్యాశాఖ అధికారులు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం తాత్కాలికంగా ఇన్చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారిగా అనంతపురం ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాస రావు కొనసాగనున్నారు. ఉపవిద్య శాఖ అధికారి కూడా ఇటీవల ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారిగా ఉన్నప్పుడు జిల్లా కలెక్టర్ పలు విషయాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా షోకాజ్ నోటీస్ కూడా ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈయన కూడా ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారిగా కొనసాగేందుకు అయిష్టత చూపుతున్నట్లు తెలిసింది.

## రెండు వార్డుల్లో ఆకస్మికంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

గుంతకల్లు, మే 23 ప్రభాతవార్త

రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి గుంతకల్లుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం పట్టణంలోని 25,26 వార్డుల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నివాస స్థలాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలి ంచారు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని సదరు యజమానులకు సూచించారు. స్థలాల్లో వ్యర్థాలను వేసి అపరి శుభ్రంగా ఉంచితే జరిమానాలు వేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.లక్ష్మీదేవి, ఏఈ హరికృష్ణ ఉన్నారు.

